ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 28 మార్చి 2024 | 5



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (గురు) సా.6.24
సహరీ (శుక్ర) ఉ.4.39

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	33	26



అమలాపురం గడియార స్తంభం సెంటర్లోని ఓ సినిమా థియేటర్ ప్రాంగణం ప్రేక్షకులు రాక నిర్మానుష్యంగా ఉన్న దృశ్యం

షో లే!

- సినిమా వేయాలా.. వద్దా..
- జనమొస్తేనే బొమ్మ... రాకుంటే సొమ్ములు తిరిగి చెల్లింపు

అమలాపురం టౌన్, మార్చి 27:
ఏ సినిమా హాలులో ఏ షో పడుతుందో తెలియదు. అసలు సినిమా వేస్తారో లేదో కూడా తెలియని వింత పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. ఒక అమలాపురం పట్టణంలోనే రెండు థియేటర్లు మినహా మిగిలిన అన్ని థియేటర్లలోనూ ఇదే పరిస్థితి. సినిమా హాళ్లు అన్నింటినీ ఏసీ థియేటర్లుగా మార్చేశారు. దాంతో ఒక్క షో వేయాలంటే కనీసం రూ.1,500 పైబడి ఆదాయం రావాల్సి ఉంది. ఆ మాత్రం సొమ్ములు కూడా రాకపోవడంతో ఒక్కో థియేటర్‌లో ఒక్కో రోజు ఒక్క షో కూడా వేయని పరిస్థితి వారం రోజులుగా వుంది. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకున్న వారు థియేటర్లకు వస్తే కనీస ఆదాయం రానప్పుడు వారికి సొమ్ములు తిరిగి చెల్లిస్తున్నారు. సినీ చరిత్రలో ఇంతటి దయనీయ పరిస్థితిని ఎన్నడూ చూడలేదని థియేటర్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు, మూడు నెలల వరకు పెద్ద హీరోల సినిమా విడుదల లేకపోవడంతో ఇదే పరిస్థితి కొనసాగేలా ఉందని వాపోతున్నారు. గతంలో ఎండ వేడిమి తాళలేకసినిమా థియేటర్లకు వచ్చి సేదతీరేవారు. నేడు ఎండలు మండిపోతున్నా థియేటర్ల వైపు చూసేవారే కరువయ్యారు.

అనపర్తి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిగా శివ రామ కృష్ణం రాజు



- 7లో



అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అధికారపక్ష కౌన్సిలర్లు

పాటదారులకు అనుకూలంగా పని చేస్తారా!

- అధికారుల తీరుపై అధికారపక్ష కౌన్సిలర్ల ఆగ్రహం
- కౌన్సిల్ ఆమోదం లేకుండా డిపాజిట్లు ఎలా చెల్లించారు
- వాడివేడిగా అమలాపురం కౌన్సిల్ సాధారణ సమావేశం

అమలాపురం టౌన్, మార్చి 27: పాటదారులకు అనుకూలంగా పని చేస్తూ మున్సిపల్ ఆదాయానికి టెండరు పెడతారా.. నిబంధనలు పట్టించుకోరా అని అధికారపక్ష కౌన్సిలర్లు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లోపభూయిష్టంగా నిర్వహించిన పాటను రద్దు చేసి పురపాలక సంఘ సిబ్బంది మార్కెట్ ఫీజులు వసూలు చేయాలని ఒక దశలో మండిపడ్డారు. నాలుగు అజెండా అంశాలపై చర్చించేందుకు అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. పురపాలక సంఘంలో రోజువారీ మార్కెట్ ఫీజులు వసూలు చేసుకునే హక్కును పొందేందుకు నాలుగు పర్యాయాలు వేలంపాట నిర్వహించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ ప్రశ్నించారు. అసలు స్వీపింగ్ చార్జీలు ఎలా నిర్ధారణ చేస్తారన్నారు. కౌన్సిల్‌తో సంప్రదించకుండా స్వీపింగ్ చార్జీలను మీరెందుకు తగ్గించారని కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర అధికారులను నిలదీశారు. గెజిట్ రూల్స్ కూడా పాటించరా అని ప్రశ్నించారు. పాట దక్కించుకున్నవారు సబ్ లీజుకు ఇవ్వరాదని గెజిట్‌లో స్పష్టంగా ఉన్నప్పటికీ ఇక్కడ జరుగుతున్నది అదే కదా అన్నారు. కాంట్రాక్టర్లు రింగ్ అయి మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారని మండిపడ్డారు. మార్కెట్ ఫీజుల వసూళ్ల కోసం నిర్వహించిన వేలంలో పాల్గొన్న కాంట్రాక్టర్లు సమర్పించిన సాల్వెన్సీలు, కట్టిన డిపాజిట్ల వివరాలను చూపించాలని డిమాండు చేశారు. వేలంపాట నిర్వహించడం ద్వారా ధరావతు కింద ఎంత వచ్చిందో చెప్పాలన్నారు. ఒకేడీడీ, ఒకే సాల్వెన్సీలతో కాంట్రాక్టర్లు పాటకు వస్తున్నా ఎందుకు పట్టించుకోరని నిలదీశారు. డిపాజిట్ కట్టిన రశీదులను తీసుకువచ్చే వరకు ఇక్కడే ఉంటామని అధికారపక్ష కౌన్సిలర్లు దొమ్మేటి రాము, రుద్రరాజు నానిరాజు, రాజేష్ తదితరులు అధికారులకు అల్టిమేటం జారీ చేశారు. లక్షలాది రూపాయలు డిపాజిట్లుగా కట్టించుకుని కనీసం రశీదులు ఇవ్వరా అని ప్రశ్నించారు. కమిషనరు మనోహర్ కల్పించుకుని వేలంపాటల సమయంలో నగదు రూపంలో డిపాజిట్లు దగ్గర పెట్టుకుంటామని, ఒకవేళ డిపాజిట్లకు రశీదులు ఇస్తే ఆమొత్తం సొమ్ములు సీఎఫ్ఎంఎస్ ఖాతా నుంచి తిరిగి కాంట్రాక్టర్లకు రావాల్సిన పరిస్థితి ఉందన్నారు. అందుకే డిపాజిట్లు దగ్గర పెట్టుకుని పాటలు నిర్వహించామన్నారు. ఇక పురపాలక సంఘం తరఫున వసూళ్లు జరిపితే సగం కూడా సొమ్ములు వసూళ్లు చేయలేమని ఆయన స్పష్టం చేశారు. గెజిట్‌లో 25 షరతులు పెట్టారని, అయితే ఎవరికో లబ్ధి చేకూర్చే విధంగా పాటలు నిర్వహించారంటూ అధికారపక్ష కౌన్సిలర్లు మండిపడ్డారు. పట్టణంలో మంచినీటి కుళాయిలు లేని ఇళ్లకు సైతం కుళాయి పన్నులు విధించడం ఏమిటని జనసేన కౌన్సిలర్ యేడిద శ్రీను ప్రశ్నించారు. దీనిపై ఫిర్యాదులు అందుతున్నందున పట్టమంతా సర్వే నిర్వహిస్తున్నామని కమిషనరు తెలిపారు. ట్రాక్టర్ల మరమ్మతులకు లక్షలాది రూపాయలు నిధులు ఖర్చు చేస్తున్నా చెత్తను సేకరించే ట్రాక్టర్లు ఎంత చెత్తగా మారాయో మీకు కనిపించట్లేదా అని కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ ప్రశ్నించారు. సంబంధిత ఏఈ విధులకు సరిగా హాజరుకాకపోగా కనీసం ఏవిధమైన సమాధానం చెప్పట్లేదన్నారు. పట్టణంలోని పార్కుల మెయింటినెన్స్‌కు వర్క్ ఇన్‌స్పెక్టర్లను ప్రత్యేకంగా నియమించామని కమిషనరు తెలిపారు. కౌన్సిలర్లు బండారు గోవిందు,గండి దేవిహారిక, గొలకోటి విజయలక్ష్మి, అబ్బిరెడ్డి చంటి తదితరులు పలు అంశాలపై అధికారులను ప్రశ్నించారు.



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- ప్రతికూల వార్తల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు
- కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా కొనసాగిస్తున్నట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల్లో వస్తున్న ప్రతికూల వార్తల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయన్నారు. బుధవారం తొలుత రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బు, విలువైన వస్తువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. 85ఏళ్లు పైబడిన వృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులను పోలింగ్ కేంద్రాల వారీగా గుర్తించి ప్రాథమిక నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సీ-విజిల్ యాప్‌కు జిల్లా స్థాయి కాల్ సెంటర్లలో కోడ్ ఉల్లంఘనలు తదితర అంశాలపై వస్తున్న ఫిర్యాదులపై ప్రత్యేక బృందాలు సత్వరం స్పందించి పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నవారు రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనరాదన్నారు. బ్లూ కలర్ రంగు మాత్రమే వేసిన ప్రభుత్వ భవనాలు, ఓవర్ హెడ్ ట్యాంకులు కోడ్ ఉల్లంఘన కింద పరిగణించరాదని స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు జి.కేశవర్ధనరెడ్డి, ఎస్.సుధాసాగర్, మదన్‌మోహనరావు, డి.ఎల్లారావు, ఎస్వీవీ సత్యనారాయణ, అమలాపురం లోక్‌సభ సహాయ రిటర్నింగ్ అధికారి ఎం.ఝాన్సీరాణి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ టి.వైద్యనాథశర్మ, పరిపాలనాధికారి సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఇసుక నిల్వలను చూపిస్తున్న బండారు సత్యానందరావు

అక్రమ నిల్వలు ఇవిగో!

- ప్రభుత్వ స్థలంలో ఇసుక గుట్టలను వెలుగులోకి తెచ్చిన మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, టీడీపీ నేతలు

ఆలమూరు, మార్చి 27: ప్రభుత్వ స్థలాల్లో ఇసుక అక్రమ నిల్వలను తెలుగుదేశం పార్టీ వెలుగులోకి తీసుకొచ్చింది. మండలంలోని చింతలూరులో ఇళ్ల స్థలాల కోసం సేకరించిన స్థలాల్లో ఎటువంటి అనుమతి లేకుండా ఉంచిన ఇసుకను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి దండంగి మమత, నాయకులు వైట్ల శేషుబాబు, చింతలూరి ఫణికుమార్, పెద్దింటి మంజుల, దండంగి రామారావు, బుంగ శ్రీనివాస్, బలుసు శ్రీనివాస్, నెక్కంటి వీరేంద్ర బుధవారం పరిశీలించారు. అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. వైసీపీ అక్రమాలకు అడ్డుఅదుపూ లేకుండా పోతోందని సత్యానందరావు ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని తహసీల్దారు, ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. తహసీల్దారు అనిల్‌కుమార్‌తో బండారు ఫోనులో మాట్లాడగా చర్యలు తీసుకుంటామని చెప్పినట్టు వివరించారు.

చింతలూరులో బొడ్డు మాణిక్యం అనే మహిళ ఇంటికి టీడీపీ మహాశక్తి స్టిక్కర్ ఉందని... వెంటనే దానిని తొలగించకపోతే ప్రభుత్వ పథకాలను పూర్తిగా నిలుపుదల చేయిస్తామని వైసీపీ నేతలు బెదిరించడాన్ని సత్యానందరావు ఖండించారు. ఆయన ఆమె ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పారు. బెదిరింపులకు ఎవరూ భయపడవద్దని కోరారు.

శాంతియుత ఎన్నికలకు అడ్డుతగిలితే శిక్షించేందుకు కట్టుదిట్టమైన చట్టాలు

- జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు

అమలాపురం టౌన్, మార్చి 27: సార్వత్రిక ఎన్నికలు సజావుగా, శాంతియుతంగా జరగడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. శాంతియుత ఎన్నికలకు గండికొట్టేలా ప్రయత్నించే శక్తులను కఠినంగా శిక్షించడానికి కట్టుదిట్టమైన చట్టాలను ఎన్నికల కమిషన్ ప్రవేశ పెట్టిందన్నారు. సార్వత్రిక ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, పోటీ చేయనున్న అభ్యర్థులు జిల్లా యంత్రాంగానికి పూర్తిగా సహకరించాలని కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్వో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ సక్రమంగా జరిగేటట్టు చూడడంలో రాజకీయ పార్టీలతో పౌర సమాజం పాత్ర కూడా ముఖ్యమన్నారు. ఓటర్లు నిష్పక్షపాతంగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు సమాజంలో కులాలు, జాతుల మధ్య, మత పరమైన, భాషా పరమైన ఉద్రేకాలను కలిగించే కార్యకలాపాలు నిర్వహించరాదని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మసీదులు, చర్చిలు, దేవాలయాలు, ఆరాధనా ప్రదేశాలను వేదికగా వినియోగించరాదన్నారు. సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులు కామన ప్రభాకరరావు, దూరి రాజేష్, కారెం వెంకటేశ్వరరావు, కాశి లక్ష్మీభవానీ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ టి.వైద్యనాథ శర్మ, రవిశంకర్, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులకు ఎన్నికల విధుల్లో భాగంగా రెండో రోజైన బుధవారం శిక్షణ ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి ఆరు కవర్లలో ఎన్నికల మెటీరియల్ సీలింగ్ చేయాల్సి ఉంటుందని డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. పబ్లిక్ హెల్త్, కుటుంబ సంక్షేమం, కో-ఆపరేటివ్ సొసైటీ రిజిస్టర్ కార్యాలయాలు, పురపాలక సంఘాల ఉద్యోగులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. పోలింగ్ కేంద్రం వద్ద పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాలను ప్రచురించాలన్నారు. మాస్టర్ ట్రైనర్ ప్రకాష్, కలెక్టరేట్ ఏవో సీహెచ్‌వీరాంజనేయప్రసాద్, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

వైసీపీ ప్రచారంలో ఆ ముగ్గురూ!

జగన్నాయకులపాలెంలో ఇద్దరు వలంటీర్లు, కొత్తపేట మండలం ఖండ్రిగ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ విధుల నుంచి తొలగింపు

ద్రాక్షారామ/అమలాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని జగన్నాయకులపాలెంలో గ్రామ వలంటీర్లుగా పనిచేస్తున్న ఇద్దరు వైసీపీ ర్యాలీలో పాల్గొన్నట్టు తెలియడంతో వారిని విధుల నుంచి తొలగించినట్టు ఆర్డీవో ఎస్.సుధాసాగర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 16 నుంచి ఎన్నికల నియమావళి అమలులో ఉంది. గ్రామ వలంటీర్లుగా పనిచేస్తున్న సాదే రాజేష్‌కుమార్, అనిశెట్టి వీరవెంకటరమణ ఈ నెల 25న జరిగిన రాజకీయ పార్టీ ర్యాలీలో పాల్గొనడంతో వారిపై చర్యలు తీసుకున్నారు.

కొత్తపేట: ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వైసీపీ ప్రచారంలో పాల్గొన్నాడన్న సమాచారంతో కొత్తపేట మండలం ఖండ్రిగ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ దూనబోయిన శ్రీనివాస్‌ను ఆ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సస్పెండ్ చేసినట్టు ఎంపీడీవో కందుల వాణి తెలిపారు. ఈ నెల 20న వైసీపీ ఎన్నికల ప్రచారంలో శ్రీనివాస్ పాల్గొన్నాడన్న ఫిర్యాదుతో అతడిని విధుల నుంచి తొలగించారు.

పదో తరగతి సోషల్ పరీక్ష ప్రశాంతం

ముమ్మిడివరం, మార్చి 27: జిల్లాలో పదో తరగతి సోషల్ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. 112 కేంద్రాల్లో 19,608 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 19,072 హాజరయ్యారు. 536 మంది గైర్హాజరైనట్టు డీఈవో ఎం.కమలకుమారి తెలిపారు. ఎక్కడా మాల్ ప్రాక్టీసు, మాస్ కాపీయింగ్ జరగలేదు. డీఈవో కమలకుమారి ఏడు, అసిస్టెంట్ కమిషనర్ ఎం.సురేష్ ఐదు, డీవైఈవో ఎస్.ఫణి నాలుగు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు 31 పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

అప్పనపల్లి బాలబాలాజీ హుండీల ఆదాయం రూ.27.67 లక్షలు

...వివరాలు 7లో

అత్యవసర సేవల్లో పాల్గొనే 33 శాఖల ఉద్యోగులకు

పోస్టల్ బ్యాలెట్

అమలాపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):
పోలింగ్ విధులతో పాటు వివిధ అత్యవసర సేవల్లో ఉండే వారికి కేంద్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే అవకాశం కల్పించిందని ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా నోటిఫికేషన్ జారీ చేసినట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. లోక్‌సభ, అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అత్యవసర సేవల్లో నిమగ్నమయ్యే 33 శాఖలకు చెందిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించడంతో పాటు 12-డి పత్రాలను అందుబాటులో ఉంచుతారన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఎప్పుడు వేయాలో ముందుగా తెలియజేస్తారు.

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలి

ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్, మార్చి 27:
ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు కేంద్ర బలగాలతో కలిసి బుధవారం అమలాపురంలో పోలీసులు కవాతు నిర్వహించారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు, సమస్యాత్మక గ్రామాలు ఉన్న ప్రాంతాల్లో కవాతు జరిపారు. అమలాపురం పట్టణ పరిధిలోని మద్దాలవారిపేట, శ్రీరామపురం, పుల్లయ్య రామాలయం, వెత్సావారి అగ్రహారం, గండు వీధి, రవణం మల్లయ్య వీధి, నల్లా వీధుల్లో కవాతు జరిపారు. పలు ప్రాంతాల్లో స్థానికులతో కలిసి సమావేశాలు నిర్వహించారు. ఓటర్లకు భరోసా కల్పించారు. పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం వెత్సావారి అగ్రహారంలో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు




రంజాన్ వేళ ఆవేదన

సీఎం జగన్.. నా మైనారిటీలు అని నోటితో అంటూనే సంక్షేమం చూడకుండా నొసటితో వెక్కిరిస్తున్నట్లుగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రతి వర్గాన్నీ మాటల గారడీతో మభ్యపెట్టినట్టే ముస్లింలను కూడా వంచన చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ప్రభుత్వం వచ్చాక సంక్షేమం లేదు. మసీదుల అభివృద్ధి పట్టదు. రంజాన్‌కు కానుక తీసేశారు. ఆర్థిక క్రమశిక్షణ గాడితప్పడంతో అప్పు పుడితే గానీ రోజు గడవని పరిస్థితుల వల్ల చివరికి ఇమామ్ (ప్రధాన ప్రార్థనా గురువు), మౌజన్ (సహాయ ప్రార్థనా గురువు)లకు జీతాలు కూడా సక్రమంగా చెల్లించలేని దుస్థితి దాపురించింది. దీంతో రంజాన్ వేళ ఇమామ్, మౌజన్‌లు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి):

- ఇమామ్, మౌజన్‌లకు 6 నెలల నుంచి భృతి లేదు
- మసీదులకు ప్రత్యేక ఆర్థిక సహాయం తీసివేత
- ముస్లింలపై వైసీపీ 'గాలి' ప్రేమ
- ఏదో చేసేస్తున్నామంటూ ఆర్భాటపు ప్రచారాలు
- క్షేత్రస్థాయిలో జరిగింది మాత్రం శూన్యం

ప్రతి మసీదులో ఇమామ్, మౌజన్ ఉంటారు. వారిని ఆర్థికంగా ఆదుకోవాలనే తలంపుతో గత ప్రభుత్వం ప్రతి నెలా గౌరవ భృతిని ప్రవేశపెట్టింది. ఇమామ్‌కి రూ.5 వేలు, మౌజన్‌కి రూ.3 వేలు క్రమం తప్పకుండా గౌరవ భృతి అందేది. అయితే, గత ఎన్నికల సందర్భంగా అలవికాని హామీలు వల్లె వేసిన జగన్.. ఇమామ్, మౌజన్‌లకు రూ.10 వేలు, రూ.5 వేలు ఇస్తామంటూ ప్రగల్భాలు పలికారు. తీరా వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాట మరిచిపోయారు. నాలుగేళ్ల పాటు ముస్లింలు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదు. ఉద్యమం చేసిన తర్వాత తప్పనిసరి పరిస్థితుల్లో ఏడాది నుంచి ఇమామ్, మౌజన్‌లకు జీతాల పెంపు జరిగింది. అయితే, ఆరు నెలల నుంచీ పెంచిన జీతాల మాట దేవుడెరుగు.. అసలు పైసా కూడా రాలేదు. దీంతో జిల్లాలోని 205 మసీదుల్లోని సుమారు 400 మంది ఇమామ్, మౌజన్లు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఆరు నెలల నుంచీ జీతాలు రాకపోవడంతో రంజాన్ వేళ అప్పుల కోసం తిప్పలు పడాల్సి వస్తోందని 'అల్లా సాక్షిగా' వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పెంపు చూపి దగా

నాలుగేళ్లపాటు నిర్లక్ష్యం చేసి చివరి ఏడాదిలో ఎన్నికల్లో లబ్ధి లక్ష్యంగా ఇమామ్, మౌజన్‌లకు జీతాలు పెంచారు. అయితే, ఆ పెంపు చూపించి సంబుర పడండంటూ ఊదరగొట్టిన వైసీపీ నాయకులు.. మరోవైపు ఉపకారాలను పీకేశారు. పేద, ధనిక అనే బేధం లేకుండా రంజాన్ ఆనందంగా జరుపుకోవాలని సంకల్పించి గత ప్రభుత్వంలో రంజాన్ వచ్చిందంటే తోఫా పేరుతో కానుక అందజేసేవారు. తోఫాలో పప్పు, ఉప్పు, సేమియాలు, నెయ్యి, పసుపు వంటి ఇఫ్తార్ వంటకు అవసరమైన వస్తువులు ఉండేవి. ఈ ప్రభుత్వం వచ్చాక తోఫాను తీసేసింది. దాని స్థానంలో ప్రత్యామ్నాయం కూడా ఏమీ అందజేసే ఆలోచన చేయలేదు. అలాగే గత ప్రభుత్వంలో రంజాన్ మాసం రాక ముందే మసీదుల మరమ్మతులు, రంగులు, ఎలక్ట్రికల్ తదితర పనుల కోసం నిధులు విడుదల చేసేవాళ్లు. గ్రామాల్లోని మసీదులకు రూ.15 వేలు, పట్టణాల్లోని మసీదులకు రూ.25 వేలు అందజేసేవారు. దీంతో మసీదుల్లోని చిన్నచిన్న పనులకు ఇబ్బంది ఉండేది కాదు. వైసీపీ పాలన వచ్చిన వెంటనే ఆ ఆర్థిక సహాయానికీ నీళ్లొదిలేశారు. పెళ్లి కానుక అంటూ 'దుల్హన్' పథకాన్ని తెరపైకి తెచ్చారు. అయితే సవాలక్ష నిబంధనలు విధించి నిర్వీర్యం చేసేశారు. 10 శాతం మందికి కూడా లబ్ధి చేకూరలేదు.

మమకారం గాలివాటం

వైసీపీ ప్రభుత్వం వచ్చాక కొత్తగా ఒక్క మసీదుకు నిధులు విడుదల జరగలేదు. గత ప్రభుత్వంలో 205 మసీదులు, 410 మంది ఇమామ్, మౌజన్‌లు ఉండగా ఐదేళ్లుగా ఈ ప్రభుత్వంలో ఒక్క అంకె వాటికి జతకాలేదు. 150 వరకూ కొత్తగా మసీదులు నిర్మించినా వాటికి ఎలాంటి సహాయమూ చేయడం లేదు. వాటిలోని ఇమామ్, మౌజన్‌లకు గౌరవ భృతి కల్పించలేదు. 2019లో రెహమత్‌నగర్‌లో రూ.90 లక్షలతో షాదీఖానా నిర్మాణానికి ఏర్పాట్లు జరిగాయి. అప్పటి ఎంపీ మురళీమోహన్ తన ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.25 లక్షలు ఇవ్వగా.. ప్రభుత్వం రూ.65 లక్షల సమకూర్చింది. టెండరు కూడా ఖరారు అయ్యింది. తర్వాత ఎన్నికలు రావడం, వైసీపీ ప్రభుత్వం రావడం తెలిసిందే. దీంతో రూ.65 లక్షల నిధులూ వెనక్కి తీసేసుకున్నారు. మునిసిపల్ కార్పొరేషన్‌కి జమ చేసిన రూ.25 లక్షలు దారి మళ్లిపోయాయి. ఆ తర్వాత నాలుగేళ్ల పది నెలల వరకూ షాదీఖానా ఊసేలేదు. ముస్లింలు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఇప్పుడు ఎన్నికలకు ఇంకా నెలన్నర ఉందనగా షాదీఖానా నిర్మిస్తామంటూ వైసీపీ నేతలు బడాయి కబుర్లు చెబుతుండడంపై ముస్లింలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఖచ్చితంగా ఓట్లు దండుకునే ఎత్తుగడేనని ఆరోపిస్తున్నారు. ఇక, ఎడాపెడా కార్పొరేషన్ల పందేరంలో భాగంగా మైనారిటీ కార్పొరేషన్, షేక్ అండ్ షేక్ కార్పొరేషన్, నూర్ బాషా కార్పొరేషన్, సంచార ముస్లిం జాతుల కార్పొరేషన్‌లను ఏర్పాటు చేశారు. కానీ ఒక్క కార్పొరేషన్‌కీ నిధులు, విధులు లేవు. ఛైర్మన్‌లకు, డైరెక్టర్లకు కార్యాలయాల్లో కుర్చీలు కూడా లేని దుస్థితి ఉంది.

సంక్షేమాన్ని పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం



షేక్ సుభాన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్

వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచీ ముస్లిం మైనారిటీలకు ఏ రకమైనా ఆర్థిక సహాయమూ అందడం లేదు. సంక్షేమాన్నీ పట్టించుకోవడం లేదు. ఆర్థిక అభివృద్ధి ఒక్క అంగుళం కూడా ముందుకు కదల్లేదు. ఇమామ్, మౌజన్‌లకు కూడా జీతాలు సవ్యంగా ఇవ్వలేకపోతున్నారు. రంజాన్ వేళ ఇది చాలా బాధాకరమైన విషయం. ఏదొక పథకం పెట్టి ఎన్నో నిబంధనలు విధించి ఆవేదనకు గురి చేస్తున్నారు. చివరికి బరియల్ గ్రౌండ్స్‌కి ప్రహరీలకు కూడా నిధులు లేవు. గత ప్రభుత్వంలో ముస్లింల సంక్షేమం బాగా జరిగింది. మసీదుల అభివృద్ధి శరవేగంగా జరిగింది.



సుమ రిఫైనరీస్ నుంచి కమ్ముకున్న పొగలు

సుమ రిఫైనరీస్‌లో మంటలు

చుట్టుపక్కల ఫ్యాక్టరీల సిబ్బంది, చక్రద్వారబంధం గ్రామస్థులు పరుగులు



రాజానగరం, మార్చి 27: మండలంలో చక్రద్వారబంధంలోని సుమ రిఫైనరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో బుధవారం మంటలు వ్యాపించడంతో గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు భయంతో వణికిపోయారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడిన దట్టమైన పొగల సెగలు చక్రద్వారబంధం గ్రామాన్ని కమ్మేశాయి. దీంతో ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని సమీపంలోని పలు ఫ్యాక్టరీ యజమానులు, కార్మికులతో పాటుగా పరుగులు తీశారు. చక్రద్వారబంధం గ్రామంలో గత 13 ఏళ్లుగా సుమ ఆయిల్ రిఫైనరీస్ ఫ్యాక్టరీ నడుస్తోంది. అనివార్య కారణాలతో గత ఏడాది కాలంగా మూతపడటంతో ఫ్యాక్టరీని నమ్ముకున్న కొంత మంది కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించేందుకు బుధవారం ఫ్యాక్టరీలోని ఒక యంత్ర పరికరానికి వెల్డింగ్ చేస్తుండగా బాయిలర్‌కు ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు భయంతో ప్రాణాలు అరచేతిలో పట్టుకుని భయంతో బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న సంబంధిత యజమాని అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేశారు. అప్పటికే ఆకాశాన్ని అంటే రీతిలో మంటలు వ్యాపించి పరిసర గ్రామాలైన రాధేయపాలెం, కానవరం, ఫరిజల్లిపేట, రాజానగరం ప్రాంతాలకు దట్టమైన పొగలు విస్తరించడంతో ఎక్కడ ఏం జరుగుతుందో తెలియక ప్రజలు ఆందోళనకు గురయ్యారు. రాజమహేంద్రవరంలోని ఆర్యాపురం, ఇన్నీస్‌పేట, అనపర్తి ప్రాంతాల నుంచి వచ్చిన మూడు అగ్నిమాపక యంత్రాలు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే చర్యలు చేపట్టారు. ప్రమాదంలో ప్రాణనష్టం లేదని, రూ.35 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఏడీఏ అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు తెలిపారు.

వెండి ధ్వజస్తంభానికి కళా ప్రకర్షణ



అన్నవరం, మార్చి 27: రత్నగిరివాసుడైన సత్యదేవుడి ఆలయంలో ప్రస్తుతమున్న వెండి ధ్వజస్తంభానికి గురువారం కళా ప్రకర్షణ గావించనున్నారు. ఈ ధ్వజస్తంభం లోపల కర్ర పుచ్చిపోయి శిథిలస్థితికి చేరడంతో నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేయాలని గత ఈవో చంద్రశేఖర ఆజాద్ సంకల్పించారు. అయితే దీనిని సుమారు రూ.3.50 కోట్లతో బంగారంతో తయారు చేసేందుకు నెల్లూరుకు చెందిన ఒకదాత ముందుకొచ్చారు. బంగారు ధ్వజస్తంభం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కళా ప్రకర్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం నుంచి పండితులు ప్రత్యేక పూజలను నిర్వహించడంతో పాటుగా హోమాలను చేపట్టి శాస్త్రోక్తంగా వెండి ధ్వజస్తంభం బయటకు తీయనున్నారు. బంగారు ధ్వజ స్తంభ వం ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఏప్రిల్ 18 నుంచి ప్రారంభించి 22న ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ పండితులు తెలిపారు. 1500 వ్రత మండపంలో కార్యక్రమాలు చేయాల్సి ఉన్నందున గురువారం 1500 వ్రతం టికెట్ల విక్రయాలు నిలుపుదల చేయాలని నిర్ణయించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష

అన్నవరం, మార్చి 27: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి బుధవారం ఒకదాత రూ 1,01,000 విరాళంగా సమర్పించారు. మండపేటకు చెందిన సంకా శ్రీనివాస రంగారావు ఈ మొత్తాన్ని ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా ఆయన దాతను అభినందించి అంతరాలయ దర్శనం, ప్రసాదాలు అందజేశారు.



విరాళం అందిస్తున్న దాతలు

జిల్లాలో డ్రెడ్జింగ్‌కు అనుమతి లేదు

'తూర్పు' కలెక్టర్ మాధవీలత

కొవ్వూరు, మార్చి 27: తూర్పుగోదావరి జిల్లాలో ఇసుక డ్రెడ్జింగ్‌కు ఎటువంటి అనుమతులు లేవని జిల్లా కలెక్టర్ కె. మాధవీలత తెలిపారు. బుధవారం కొవ్వూరు గామన్ బ్రిడ్జి మరమ్మత్తు పనులను పరిశీలించడానికి వచ్చినఆమె విలేకర్లతో మాట్లాడారు. గోదావరి వంతెనల దగ్గర నుంచి 500 మీటర్లలోపు ఇసుక తవ్వకాలు చేపట్టరాదన్నారు. 500 మీటర్లలోపు ఇసుక తవ్వకాలు, లిఫ్టింగ్ చేయరాదని ఎస్ఈబీ అధికారులకు సమాచారం అందించినట్లు చెప్పారు. పడవలపై మాన్యువల్‌గా బోట్‌మేన్ సొసైటీల ద్వారా మాత్రమే ఇసుక తవ్వకాలు చేపట్టాలన్నారు. సెబ్ అడిషనల్ ఎస్పీ దృష్టికి ఈ అంశాన్ని తీసుకువెళ్లి డ్రెడ్జింగ్ చేసేవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తామన్నారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఆర్‌డీసీ ఈఈ శ్రీకాంత్, ఏఈఈ బి.ఏ. వర్మ, తహసీల్దార్ కె.మస్తాన్ పాల్గొన్నారు.

1న బీఈడీలో స్పాట్ అడ్మిషన్లు

దివాన్‌చెరువు, మార్చి 27: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యా కళాశాలలో బీఈడీ ప్రవేశాలకు ఏప్రిల్ 1వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ బుధవారం తెలిపారు. బీఈడీ రెండేళ్ల కాల వ్యవధి కోర్సులో ప్రవేశాలకు ఆసక్తి, అర్హత గల వారు హాజరుకావాలన్నారు. రెగ్యులర్ సీట్లు 14, ఈడబ్ల్యూఎస్ 5 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. తప్పనిసరిగా బీఈడీ ఎడ్‌సెట్ 2023 ప్రవేశ పరీక్షకు హాజరై ఉండాలని తెలిపారు. అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో ప్రభుత్వం నిర్దేశించిన రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. అడ్మిషన్లు కోరే విద్యార్థులు ఏప్రిల్ 1న ఉదయం 9 గంటలకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయానికి హాజరు కావాలన్నారు. వివరాలకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్లు డి.జ్యో తిర్మయి, 7093008473 లేదా యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్ర దించాలన్నారు.

విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి

సామర్లకోట, మార్చి 27: సామర్లకోట పట్టణ పరిధిలో ఈటీసీ లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటికి రంగులు వేస్తున్న పెయింటర్ ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. ముకుందవరం గ్రామానికి చెందిన పెయింటర్ బుల్లివీర్రాజు(22) రోజూలాగే పెయింటింగ్ పనులు చేస్తుండగా సమీపంలోని 11 కేవీఏ విద్యుత్ లైన్లు చూడకుండా పెయింటింగ్ పనులు చేస్తుండగా ఒక్కసారిగి విద్యుదాఘాతానికి గురయ్యాడు. సమీపంలో ఉన్న పలువురు హుటాహుటిన సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే బులివీర్రాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసును సామర్లకోట పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలబాలాజీ ఆదాయం రూ.27.67 లక్షలు

మామిడికుదురు, మార్చి 27: మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారి హుండీల ఆదాయం రూ.27,67,808 వచ్చినట్టు సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. అమలాపురం దేవదాయశాఖ కమిషనర్ డి.నాగమల్లేశ్వరరావు, తనిఖీదారు రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో 54 రోజులకు గాను హుండీ లెక్కింపు నిర్వహించారు. 10.300 గ్రాముల బంగారం, కిలో 150 గ్రాముల వెండి వచ్చినట్టు సహాయ కమిషనర్ తెలిపారు.

ఆకట్టుకున్న నావికాదళ విన్యాసాలు



యుద్ధ నౌకల నుంచి దాడులకు సిద్ధమవుతున్న సైన్యం



సర్పవరం జంక్షన్, మార్చి 27 : ఇండియా-అమెరికా త్రివిధ దళాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైగర్ ట్రంప్ విన్యాసాలు బుధవారం కాకినాడ సాగరతీరంలో ప్రారంభమయ్యాయి. సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్‌లో భారత తూర్పు నావికా దళం, అమెరికా (యూఎస్) యాంఫీబియాస్ విన్యాసాల్లో భాగంగా నావెల్ ఎన్‌క్లేవ్‌లో ఇరుదేశాలు సంయుక్తంగా ఎక్స్ టైగర్ ట్రంప్-2024 సీ ఫేజ్‌లో భాగంగా నిర్వహిస్తోన్న సైనిక విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సముద్ర తీరంలో యుద్ధం, తుపాన్లు, విపత్తు, ఆపద సమయాల్లో సముద్రం, ఆకాశయానం నుంచి ఏ విధంగా సహాయ చర్యలు అందిస్తారు, యుద్ధ సమయంలో శుత్రు దేశాలపై త్రివిధ దళాలు నిర్వహించే ఎదురుదాడి తదితర వాటిపై ఇరుదేశాల సైనికులు విన్యాసాల్లో పాల్గొని సామర్థ్యాలను ప్రదర్శించారు. యుద్ధ సమయంలో శత్రుదేశాలపై ఆకాశ, భూమార్గం, సముద్ర మార్గంలో త్రివిధ దళాలు జరిపే దాడులు, ఆయుధాల పనితీరు, యుద్ధ ట్యాంకులు, యుద్ధ నౌకలు, సైనిక హెలికాప్టర్లు, జెట్ విన్యాసాలు అబ్బురపరిచాయి. బహుళ డ్రోన్స్, యాంటీ డ్రోన్ పరికరాలే కాకుండా అత్యాధునిక యుద్ధ పరికరాలతో సామర్థ్యాలను పరీక్షించారు. ఈ విన్యాసాల్లో భారత్, యూఎస్ దళాల క్రాస్ బోర్డర్ల సందర్శనలు, సైనికుల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించేందుకు ఉమ్మడి శిక్షణ విన్యాసాలు ఎంతగానో దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. ఈ విన్యాసాల్లో సుమారు 700 మంది ఆర్మీ, నేవీల త్రివిధ దళాలకు చెందిన సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. జాయింట్ ఎక్సర్‌సైజులో పాల్గొనేందుకు అమెరికా నుంచి వచ్చిన యుద్ధ విమానాలతో పాటు ఇండియాకు చెందిన విమానాలు ఆకాశంలో చక్కర్లు కొట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బుధవారం నుంచి ఈనెల 30 వరకు ఎక్స్ టైగర్ ట్రంప్ విన్యాసాలు నిర్వహించనున్నామని, బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలను నిషేధించినట్లు కాకినాడ రూరల్ సర్కిల్ సీఐ కె.శ్రీనివాస్ తెలిపారు. తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు ఆధ్వర్యంలో పలు పోలీస్‌స్టేషన్లకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు.

అనపర్తి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిగా శివరామకృష్ణంరాజు

ప్రకటించిన బీజేపీ అధిష్ఠానం.. మాజీ సైనికుడికి అవకాశం



అనపర్తి, మార్చి 27 : అనపర్తి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా బీజేపీ తరపున బిక్కవోలు మండలం రంగాపురం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు ములగపాటి శివరామకృష్ణంరాజు పేరును ఖరారు చేశారు. ఈ మేరకు బీజేపీ కేంద్ర పార్టీ ఓ నోటీసు విడుదల చేసింది. వారం పది రోజులుగా అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిత్వం టీడీపీకా బీజేపీకా అంటూ తీవ్ర చర్చ నడిచింది. అనపర్తి సీటుపై సందిగ్ధత ఏర్పడింది. ఈ సందిగ్ధతకు తెరదించుకూ బీజేపీ అధిష్ఠానం పది సీట్లలోను అనపర్తి సీటుకు బీజేపీ అభ్యర్థిని ప్రకటించింది. బిక్కవోలు మండలం రంగాపురం గ్రామానికి చెందిన ములగపాటి రామరాజు ఏకైక కుమారుడు శివరామకృష్ణంరాజు ఉన్నత విద్యావంతుడు. తండ్రి రామరాజు 1982 నుంచి బీజేపీలో కొనసాగుతూ అనేక పదవులను నిర్వహించారు. దేశభక్తి కలిగిన శివరామకృష్ణంరాజు సుమారు 16 సంవత్సరాల క్రితం మిలటరీలో చేరి తొమ్మిది రాష్ట్రాలలో మిలటరీ ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేశారు. తండ్రి ఆరోగ్య పరిస్థితుల రీత్యా ఆయన గత రెండు సంవత్సరాల క్రితం పదవీ విరమణ చేశారు. అనంతరం ఆర్‌ఎస్‌ఎస్‌లో ప్రచార ప్రముఖ్‌గా చేరి అనంతరం బీజేపీలో మండల అధ్యక్షుడిగా సేవలందించి జిల్లా మీడియా ప్యానలిస్ట్‌గా ఎదిగి రెండు సంవత్సరాలుగా అనపర్తి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని భాగస్వామ్య పార్టీలైన టీడీపీ జనసేన పార్టీలను కలుపుకుంటూ విజయం దిశగా పయనిస్తానని చెప్పారు.

బీడు బారిన వరిచేలు

బైక్‌లు నడిపి రైతుల వినూత్న నిరసన




తాళ్లరేవు, మార్చి 27: 15 రోజులుగా సాగునీరు లేక వరిచేలు ఎండిపోతున్నా సంబంధిత ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు బుధవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు వరిచేలకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో పంట చేల్లో మోటారుసైకిల్‌పై రైతులు ప్రదర్శన చేసి నిరసన తెలియజేశారు. ఈ ప్రాంతం నుంచి ఓఎన్‌జీసీ కంపెనీకు పైపులైను ద్వారా సాగునీరు సరఫరా అవుతున్నా పంటకాలువ ద్వారా సాగునీరు పారక కాలువలు, పంటచేలు ఎండిపోతున్నాయి. సాగునీరు సరఫరా చేయకుంటే పంట దశకు వచ్చిన చేలు దెబ్బతిని రైతులు నష్టపోతారని సుమారు 40 మంది రైతులు మంగళవారం జిల్లా కలెక్టరును స్వయంగా కలసి వినతిపత్రం అందించారు. ఈ మేరకు రైతులు ఇరిగేషన్ అధికారుల రాక కోసం ఎదురుచూస్తూ వారు రాకపోవడంతో బీటలు వారిన పొలంలో బైక్ నడుపుతూ నిరసన తెలిపారు. చింతతిప్ప, పెదమాడికాపులు ప్రాంతంలో సుమారు 150 ఎకరాల్లో పంట ఎండిపోతోందని రైతులు ఆందోళన చెందారు. వంతుల వారీ విధానం శివారుకు వచ్చేసరికి వంతు సమయం అయిపోయి పూర్తిస్థాయిలో సాగునీరు అందక పంటచేలు భూమి ఎండిపోయి బీటలు తీస్తున్నాయన్నారు. ఓఎన్‌జీసీ పైపులైను ద్వారా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాగునీరు సరఫరాచేసిన ఎండిన చేలు పనిచేయవని ప్రభుత్వం రైతులకు ఇన్సూరెన్స్ రాయితీను అందించాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. లేకుంటే ఆత్మహత్యలే శరణ్యమని పేర్కొంటున్నారు.

నిందితుల హక్కులను గౌరవించాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి(డీఎల్ఎస్ఏ) ప్రత్యూషకుమారి

రాజమహేంద్రవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నిందితులను కస్టడీలోకి తీసుకునే ముందు కారణాలను కచ్చితంగా అతడికి, కుటుంబీకులకు చట్ట ప్రకారం తెలియజేయాలని.. అతడి హక్కులకు భంగం కలగకుండా పోలీసులు వ్యవహరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి(డీఎల్ఎస్ఏ), సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి పేర్కొన్నారు. డీఎల్ఎస్ఏలో ప్రీ-అరెస్ట్, అరెస్ట్, రిమాండ్ దశల్లో అందుబాటులో ఉన్న న్యాయ సేవలు, పోక్సో చట్టం, ఆంధ్రప్రదేశ్ బాధితులకు పరిహార పథకం-2015, లైంగిక వేధింపులు, ఇతర నేరాల్లోని బాధితులకు నల్సా పరిహార పథకం-2018 తదితర అంశాలపై బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అరెస్టయిన వ్యక్తికి విచారణ సమయంలో న్యాయవాదిని కలిసే హక్కు ఉందన్నారు. న్యాయవాదిని నియమించుకోలేని పక్షంలో డీఎల్ఎస్ఏ ద్వారా నిబంధనలు అనుసరించి ఉచిత న్యాయ సేవలు పొందే హక్కు ఉందన్నారు. లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల పనితీరుపై పారా లీగల్ వలంటీర్లు, ప్యానల్ లాయర్లతో చర్చించారు. ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలోని తప్పిపోయిన, ఆచూకీ తెలియని పిల్లల విషయంలో సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ద్వారా మహిళలు, పిల్లలకు శిశు గృహ, బాల సదనాలు, సంక్షేమ వసతి గృహాలు తదితర సేవల గురించి ఆ శాఖ అధికారిణి కె.విజయకుమారి వివరించారు.

'తూర్పు' ఎస్పీ జగదీశ్‌కు డీజీపీ కమెండేషన్ డిస్క్ అవార్డు



రాజమహేంద్రవరం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): విధుల్లో ప్రతిభ చూపినందుకు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ పి.జగదీశ్‌కు రాష్ట్ర స్థాయి అత్యున్నత పురస్కారం లభించింది. డీజీపీ కమెండేషన్ డిస్క్-2022 అవార్డులను ప్రకటిస్తూ ఏపీ పోలీస్ ప్రధాన కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా స్థాయి అధికారుల విభాగంలో తూర్పు ఎస్పీ పి.జగదీశ్, సిబ్బంది విభాగంలో వన్‌టౌన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ బి.సత్యానందం సిల్వర్ డిస్క్‌లు కైవసం చేసుకున్నారు. ఎస్పీకి గతేడాది కూడా సిల్వర్ డిస్క్ లభించడం గమనార్హం. జిల్లాలో పనిచేస్తున్న డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి, హెచ్‌సీలు సీహెచ్ శ్రీనివాసరావు, ఎం.సత్యకుమార్, కె.గోవర్ధనవరప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, మహిళా కానిస్టేబుళ్లు ఎల్.ప్రమీల, వి.దీనాకుమారి, కాని స్టేబుల్ డి.దుర్గాప్రసాద్, ప్రభుత్వ రైల్వే పోలీసు కానిస్టేబుల్ సీహెచ్ గోపాలకృష్ణ, ఇంటెలిజెన్స్ విభాగంలో తూర్పు గోదావరి జోన్‌లో పనిచేస్తున్న హెచ్‌సీ ఎం.బాస్క రరావు బ్రౌంజ్ డిస్క్‌లకు ఎంపికయ్యారు.

జేఎన్టీయూకేలో ఇన్నోవేషన్ ఫెయిర్ ఎగ్జిబిషన్



ఇన్నోవేషన్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరాజు

జేఎన్టీయూకే, మార్చి 27: కాకినాడ జేఎన్టీయూకే డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ ఆధ్వర్యంలో కేంద్ర విద్యాశాఖలోని నేషనల్ ఇనీషియేటివ్ ఫర్ డిజైన్ ఇన్నోవేషన్ సహకారంతో రెండు రోజులపాటు నిర్వహించనున్న ఇన్నోవేషన్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు, అక్నూ ఉపకులపతి కె.పద్మరాజు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమానికి డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.గోపాలకృష్ణ కన్వీనర్‌గానూ, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.కల్యాణ మనోహర్ సమన్వయకర్తగానూ వ్యవహరించారు. విద్యార్థులు రూపొందించిన సృజనాత్మకమైన పరికరాలను ప్రదర్శించారు. వీసీలు విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి అభినందించారు. వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించి సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలను చేపట్టాలన్నారు. అనంతరం వీసీ పద్మరాజు మాట్లాడుతూ ఇటువంటి ఇన్నోవేషన్ ఫెయిర్ ద్వారా పరిశోధనలపై ఆసక్తి పెరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి 200 పైగా నమూనాలను ప్రదర్శించినట్లు డైరెక్టర్ ఎ.గోపాలకృష్ణ తెలిపారు. అత్యుత్తమమైన నమూనాలకు నగదు బహుమతిని అందజేయనున్నామన్నారు. డైరెక్టర్లు, వైస్ ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

•అమలాపురం •పి.గన్నవరం •రాజోలు •ముమ్మిడివరం •కొత్తపేట •మండపేట •రామచంద్రపురం

ఓటుకు నోటు అసలే వద్దు

అమలాపురం టౌన్, మార్చి 27: ఓటుకు నోటు అసలే వద్దు.. ఓటు వేద్దాం మంచి నాయకుడిని ఎన్నుకుందామంటూ అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు, క్రీడాకారులతో కలిసి ర్యాలీ చేపట్టారు. జిల్లా ఎలక్షన్ నోడల్ అధికారి ఎ.మధుసూదనరావు ఆధ్వర్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ప్లకార్డులు చేతబూని ర్యాలీ జరిపారు. సమగ్ర శిక్షా అధికారులు రమేష్‌బాబు, ఎంఏకే భీమారావు తదితరులు పాల్గొన్నారు.

లంక గ్రామాల అభివృద్ధికి కృషి: వరప్రసాద్

మలికిపురం, మార్చి 27: జనసేన, టీడీపీ, బీజేపీ రాజోలు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్ మోరిలో ఒక ఇంట్లో బుధవారం పాలు పొంగించి గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. పవన్‌కల్యాణ్, చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. జగన్ పాలనలో 30ఏళ్లు వెనుకబడ్డామన్నారు. లంకగ్రామాల అభివృద్ధికి, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. యెనుముల వెంకటపతిరాజా, దిరిశాల బాలాజీ, మాజీ ఎంపీపీ పప్పుల సరస్వతీ రమేష్, గుండాబత్తుల తాతాజీ, పినిశెట్టి బుజ్జి, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, పేరాబత్తుల సచిన్, కడలి వెంకటరత్నం పాల్గొన్నారు.

బాబు పాలనలోనే పేదల భవిష్యత్‌కు గ్యారంటీ

కాట్రేనికోన, మార్చి 27: చంద్రబాబు పాలనలో మాత్రమే పేద కుటుంబాల భవిష్యత్‌కు గ్యారంటీ ఉంటుందని టీడీపీ నాయకులు అన్నారు. బుధవారం పల్లంకుర్రు బూత్ నెం.120, నడవపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి బాబు సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, జనిపల్లి సోమన్న, ఇసుకపట్ల రాంబాబు, కసిరెడ్డి రాజా, పాకలపాటి చిరంజీవిరాజు, పీటీ వర్మ, సత్తాల ప్రసాద్, రేవు రమేష్, గెద్దాడ శ్రీను, పి.ప్రసాద్, ఎం.సాయి, ఎం.శ్రీను, పి.వెంకటరమణ, ఐ.సుబ్రహ్మణ్యం, అప్పల సాయి పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణల జాతీయ సదస్సు

కాట్రేనికోన, మార్చి 27: చెయ్యేరు శ్రీనివాసా స్వయంప్రతిపత్తి ఇంజనీరింగు కళాశాలలో బుధవారం నూతన ఆవిష్కరణల లక్ష్యంగా ఎస్సీఎస్ఆర్ఐఎస్ఐఈటీ-2024 జాతీయ సదస్సును కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ ప్రారంభించారు. ఈసదస్సులో వివిధ రాష్ట్రాల నుంచి 110 పేపర్స్, ఆరు అంతర్జాతీయ పేపర్లను ప్రదర్శించారు. ముఖ్యఅతిథులుగా ఆపరేషన్స్ జిందాల్ పవర్ ప్లాంటు చైర్మన్ ఎంవీ చారి, విజ్ఞాన్ ఫౌండేషన్ సైన్స్, టెక్నాలజీ అండ్ రీసెర్చ్ డీమ్డ్ యూనివర్సిటీ డైరెక్టర్ బి.నాగేశ్వరరావు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్ యూనివర్సిటీ ఆఫ్ నబీబియా ప్రతినిధి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లిథియా ఫార్మసీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

రావులపాలెం, మార్చి 27: ఈతకోటలోని లిథియా ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు సెక్రటరీ గొల్లపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో అమెరికన్ బెసిడ్ కంపెనీ మెడికల్ కోడింగ్‌కు బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. నాలుగు రౌండ్లలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 160మంది పాల్గొనగా 25మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు సెక్రటరీ తెలిపారు. వారిని సెక్రటరీ, ప్రిన్సిపాల్ ఎన్.మనోహర్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఆత్రేయపురం, మార్చి 27: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు వెంకట్రామయ్య పేర్కొన్నారు. బుధవారం ర్యాలి గ్రామంలో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించి యువ ఓటర్లను చైతన్యవంతం చేశారు. బీఎల్వో, వీఆర్వో, సీడీపీవోలతో ర్యాలీ నిర్వహించారు. ఆర్ఐ భవాని, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన రేవు శ్రీను



ద్రాక్షారామ, మార్చి 27: కోటిపల్లికి చెందిన టీడీపీ నాయకుడు రేవు శ్రీను బుధవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను హైదరాబాద్‌లో కలిశారు. నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులను శ్రీను వివరించారు. పార్టీ అభ్యర్థి సుభాష్ గెలుపునకు కృషి చేయాలని లోకేష్ సూచించారు. పార్టీ అధికారంలోకి రాగానే సముచిత స్థానం కల్పిస్తామని లోకేష్ హామీ ఇచ్చినట్లు శ్రీను తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

అంబాజీపేట, మార్చి27: ఇసుకపూడి పరిధిలోని జక్కంశెట్టివారిపాలెంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీభూదేవిసమేత శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు సుసర్ల బుజ్జి ఆధ్వర్యంలో రత్నన్యాసు, గర్తన్యాసం, నవధాన్యాలు, నవరత్నాలు,మహాపూర్ణాహుతి, స్వర్ణ యంత్ర ప్రతిష్ఠ, ధ్వజప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠలను నిర్వహించారు. ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం







కపిలేశ్వరపురం: అంగరలో ఎమ్మెల్యే వేగుళ్ల, హరీష్‌లకు హారతులిస్తున్న మహిళలు, ఆత్రేయపురం: మెర్లపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న హరీష్, బండారు, ఉప్పలగుప్తం: వైసీపీ కార్యకర్తలను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న అయితాబత్తుల ఆనందరావు

మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

కపిలేశ్వరపురం, మార్చి27: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుకే సాధ్యమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. బుధవారం అంగరలో జరిగిన ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో టీడీపీ అమలాపురం పార్లమెంట్ అభ్యర్థి గంటి హరీష్ మాదుర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. సంక్షేమం పేరిట రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి రాజధానిలేని రాష్ట్రంగా చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని వేగుళ్లఅన్నారు. ఎన్నికల్లో తనకు, హరీష్‌కు సంపూర్ణ మద్దతుఇవ్వాలని ఓటర్లను కోరారు. ఇంటింటా పర్యటించిన వేగుళ్ల, హరీష్‌లకు అడుగడుగునా హారతులిచ్చి స్వాగతం పలికారు. టీడీపీనాయకులు పుత్సల శ్రీనివాస్, త్రిపురశెట్టి నాని, కోశెట్టి అన్నవరం, బల్లోజు రాంప్రసాద్, మత్సా గంగరాజు, కోరుమిల్లి, కపిలేశ్వరపురం గ్రామ సర్పంచ్‌లు ఆచంట సత్యనారాయణ, సాకా శ్రీనివాస్, అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ఒరిగిందేమీ లేదు

మండపేట, మార్చి 27: సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో తన అభివృద్ధి తప్ప రాష్ట్రానికి ఒరిగిందేమిలేదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ధ్వజమెత్తారు. స్థానిక 10,11,12వ వార్డుల్లో సాధికారికసారథులు, బూత్ ఇన్‌చార్జీలతో ఆయన సమావేశమయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆచారించాల్సిన అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఒక్కచాన్స్ అంటూ ఐదేళ్లలో రాష్ట్రంలో అరాచక పాలన సాగించిన జగన్‌కు ఇవే చివరి ఎన్నికలన్నారు. ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ప్రజలు పట్టం కట్టాలని ఆయన పిలుపు నిచ్చారు. వైసీపీ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కూటమి అధికారంలోకి వస్తేనే ఏపీ అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రాన్ని సీఎంజగన్ డ్రగ్స్‌కు మాఫియాగా మార్చారన్నారు. మండపేట నియోజకవర్గంలో నాల్గవసారి టీడీపీని గెలిపించి చంద్రబాబుకు బహుమతిగా ప్రజలు ఇవ్వాలని ఆయన కోరారు. టీడీపీ నేతలు మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వి.సాయికు మార్‌బాబుపాల్గొన్నారు.

పేదలను దోచుకున్న వైసీపీని సాగనంపాలి

ఆత్రేయపురం, మార్చి 27: పేదల సంపదను దోచుకున్న వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలంతా ఇంటికి సాగనంపాలని అమలాపురం లోక్‌సభ ఉమ్మడి అభ్యర్థి గంటి హరీష్‌మాదుర్, కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. సర్పంచ్ మెర్ల రాము ఆధ్వర్యంలో బుధవారం వారు మెర్లపాలెంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అసమర్థ పాలనను ప్రజలకు వివరించారు. ఐదేళ్ల జగన్ పాలనలో పేదలు అథోగతి పాలయ్యారన్నారు. హామీలను తుంగలోకి తొక్కి ప్రకృతి వనరులను దోచుకున్నారని విమర్శించారు. అనంతరం టీడీపీ సూపర్ 6 పథకాలను వివరించారు. ప్రజలు అడుగడుగునా హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కొత్తపేట సమితి మాజీ అధ్యక్షుడు మద్దూరి సుబ్బారావు, క్లస్టర్ ఇన్‌చార్జిలు కరుటూరి నరసింహరావు, కాయల జగన్నాథం, సర్పంచ్‌లు గెడ్డం సుధ, ముత్తాబత్తుల రాజు, కుదప కృష్ణమూర్తి, మెర్ల లక్ష్మీపతి, కప్పల సునీల్, బండారు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు టీడీపీలో చేరిక

ఉప్పలగుప్తం, మార్చి 27: ఎన్.కొత్తపల్లి, ఎస్.యానాం, పేరాయిచెరువు గ్రామాల్లోని ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం టీడీపీలో చేరారు. వానపల్లిపాలెంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆరిగెల నానాజీ అధ్యక్షతన, సర్పంచ్ నల్లా బాబండి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మూడు గ్రామాల నుంచి పార్టీలో చేరిన వారికి అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు టీడీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మినారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ నిమ్మకాయల సూర్యనారాయణ మూర్తి, లంకే భీమరాజు, మల్లాడి వెంకటరమణ, చిక్కం పెద్దబ్బులు, ఆకేటి పెద్ద, కంకటాల రామం పాల్గొన్నారు.

జనసేనలోనే ఉన్నా: బొంతు

మలికిపురం, మార్చి 27: పవన్‌కల్యాణ్ ఆశయాల సాధనకు తాను జనసేనలోనే ఉన్నానని, తాను పార్టీ మారుతున్నాననే వదంతులు నమ్మవద్దని జనసేన రాజోలు నియోజకవర్గ నాయకుడు బొంతు రాజేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన ఇంటి వద్ద నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో బొంతు మాట్లాడారు. జనసేనఅధినాయకుడు తనకు మాట ఇచ్చారని, పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, జనసేన మలికిపురం, రాజోలు జనసేన మండలాల అధ్యక్షులు మల్లిపూడి సత్తిబాబు, సూరిశెట్టి శ్రీనివాస్, రావి మురళీ, డాక్టర్ కె.శ్రీనివాస్, ఆనందరాజు, మంగెన నాగభూషణం, విప్పర్తి సాయిబాబు, బోనం సాయి, గుబ్బల నారాయణరావు, మంగెన హైమావతి పాల్గొన్నారు.

జయహో బీసీని జయప్రదం చేయండి

మలికిపురం,మార్చి27: రామేశ్వరంలోగురువారం జరిగే జయహో బీసీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ సఖినేటిపల్లి మండల కార్యదర్శి తాడి సత్యనారాయణ కోరారు. రామేశ్వరంలో దొంగ భాస్కరరావు ఇంటి వద్ద చెల్లింగి లీలాశ్రీనివాస్ క్లస్టర్ పరిధిలో, మధ్యాహ్నం 3గంటలకు ఉయ్యూరువారి మెరక, జాన భగవాన్ కల్యాణ మండపంలో బత్తుల రవీంద్రనాథ్ క్లస్టర్ పరిధిలో బీసీలు సభలు జరుగుతాయన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని, అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, రాజోలు అసెంబ్లీ అభ్యర్థి దేవ వరప్రసాద్ పాల్గొంటారన్నారు.

జాతీయ స్థాయి చెస్ పోటీలకు సాత్విక్



అమలాపురం టౌన్, మార్చి 27: హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరిగే జాతీయస్థాయి చెస్ పోటీలకు అమలాపురం పట్టణానికి చెందిన ద్రాక్షారపు సాత్విక్ ఎంపికైనట్టు విక్టరీ అకాడమీ ప్రిన్సిపల్ తాడి వెంకట సురేష్ తెలిపారు. విజయనగరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో సాత్విక్ ప్రతిభ చాటాడు. విక్టరీ అడకాడమీలో శిక్షణ పొందుతున్నఇతడు ఇప్పటివరకు రాష్ట్రంనుంచి జాతీయస్థాయిలో తొమ్మిది పర్యాయాలు పాల్గొన్నాడు. సాత్విక్‌ను పలువురు అభినందించారు.

కూటమి పార్టీల కార్యకర్తల వెన్నంటే ఉంటా: గిడ్డి



గిడ్డి సత్యనారాయణకు డొక్కా సీతమ్మ జ్ఞాపికను అందిస్తున్న నాథ్‌బాబు



ఐ.పోలవరం:బుచ్చిబాబు సమక్షంలో టీడీపీలో చేరిన మత్స్యకారులు

పి.గన్నవరం, మార్చి 27: కూటమి పార్టీలోని కార్యకర్తల సమస్యలను పరిష్కరిస్తూ వెన్నంటే ఉంటానని, తనను ఆశీర్వదించండని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ కోరారు. లంకలగన్నవరంలో టీడీపీ మండల అధ్యక్షుడు తోలేటి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మీ ఆశీస్సులతో ఉమ్మడి అభ్యర్థిగా మీముందుకు వచ్చానని నా గెలుపునకు సహకరించాలని కోరారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు షేక్ సుభాన్ మాట్లాడుతూమూడు పార్టీలు సమన్వయంతో పనిచేసి అత్యధిక మెజార్టీతో ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలన్నారు. అనంతరం సత్యనారాయణను డొక్కా సీతమ్మ చిత్రపటాన్ని డొక్కా నాథ్‌బాబు, డొక్కా భీమకామేశ్వరరావు సత్కరించారు. గ్రామాలు వారీగా అభ్యర్థికి పరిచయం చేశారు. సమావేశంలో సంసాని పెద్దిరాజు, త్సల్లా బింధుమాధవరావు, ఆరుమిల్లి లాల్‌బాబు, మట్టపర్తి రామకృష్ణ, చొల్లంగి సత్తిబాబు, బొండాడ నాగమణి, పులపర్తి రవికుమార్, కె.సత్యనారాయణరాజు, శేరు శ్రీనుబాబు, అంబటి కోటేశ్వరరావు, యండ్ర శ్రీనివాస్, పెచ్చెట్టి ఈశ్వరరావు, అవనిగడ్డ సత్తిబాబు, కుంపట్ల నాయుడు, వేమన మల్లేశ్వరరావు పాల్గొన్నారు. లంకలగన్నవరం మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు యన్నాబత్తుల వెంకటేశ్వరరావు టీడీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు,నాయకులు అతడిని పార్టీలోకి ఆహ్వానించారు.

టీడీపీలో చేరిన మత్స్యకారులు

ఐ.పోలవరం, మార్చి 27: తాళ్ళరేవు పంచాయతీ రత్సవారిపేట, మార్కెట్‌వీధి, మెయిన్‌రోడ్‌కు చెందిన వంద మత్స్యకార కుటుంబాలు బుధవారం మురమళ్ళ క్యాంపు కార్యాలయం వద్ద అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. పినపోతు నాగేశ్వరరావు, వాతాడి శ్రీను, రత్స కామేశ్వరరావు, గాడి తాతాలు, వాతాడి ప్రసాద్,పాలెపు నాగేశ్వరరావు, పినపోతు వీరబాబు, రేకాడి మహేష్, పోతాబత్తు కుమారస్వామి ఆధ్వర్యంలో చేరికలు జరిగాయి. వీరికి బుచ్చిబాబు కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు.

నేడు జాబ్‌మేళా

అమలాపురం టౌన్, మార్చి 27: ఆకొండి సింహాచలం సర్వీసు ట్రస్టు ఆధ్వర్యంలో అంజనాస్ ఫౌండేషన్ (హైదరాబాద్) సహకారంతో గురువారం అమలాపురం రోటరీ క్లబ్ హాలులో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ ఆకొండి పవన్ తెలిపారు. అరవింద్ టెక్స్‌టైల్స్, టాటా విస్ట్రా, అశోక్ లేల్యాండ్, శ్రీదుర్గా ఫార్మా కంపెనీ, అపోలో ఫార్మసీ, బజాజ్ అలియాంజ్, ఎస్‌బీఐ లైఫ్ సంస్థల్లో పనిచేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. బయోడేటాతో పాటువిద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలన్నారు. టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ రంగాలకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. పదో తరగతి నుంచి డిగ్రీ, బీటెక్ చదువుకున్న 26ఏళ్లలోపు యువతీ,యువకులు హాజరుకావచ్చు. వివరాలకు శివకృష్ణను 810657655 నెంబరులో సంప్రదించాలన్నారు.

టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించండి: సుభాష్





ద్రాక్షారామ: సుభాష్ సమక్షంలో టీడీపీలో చేరిన కార్యకర్తలు, కొత్తపేట:వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో బండారు సత్యానందరావు

ద్రాక్షారామ, మార్చి 27: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ కోరారు. బుధవారం ఓదూరు, నరసాపురపుపేట గ్రామాల్లో సుభాష్ ప్రచారం నిర్వహించారు. నరసాపురపుపేటలో బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. ఓదూరులో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుబ్బల యేసురాజు, టేకుమూడి సత్యనారాయణ, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, మీనవల్లి దొరబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి కొత్తపల్లి శ్రీను, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన పీఏసీసీఎస్ చైర్మన్

వేగాయమ్మపేటకు చెందిన శివల పీఏసీసీఎస్ చైర్మన్ మేకా జానకిరామయ్య బుధవారం టీడీపీలో చేరారు. ఆయనకు కండువావేసి సుభాష్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు. నెలపర్తిపాడుకు చెందిన పలువురు సుభాష్ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

కొత్తపేట, మార్చి 27: రావులపాలెం మండలం దేవరపల్లి గ్రామ శివారు కమ్మరివారిపాలేనికి చెందిన అనేక మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కొత్తపేట కాపు కల్యాణ మండపంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వారికి బండారు సత్యానందరావు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రావులపాలెం మండలం గోపాలపురానికి చెందిన వైసీపీ కార్యకర్తలు బండారు సత్యానందరావు స్వగ్రామం వాడపాలెంలో ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు. నామాల నాగేశ్వరరావు, కేతా శ్రీను, కరుటూరి నరసింహరావు, కాసా సాగర్, గంధం రామాంజనేయులు, విత్తనాల వెంకటరత్నం, కాశీ రాజకుమార్, కట్టా శ్రీను, కట్టా చిన్న, పితాని శ్రీనివాసరావు, దంగేటి రామకృష్ణ, కడలి మారేష్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

రావులపాలెం, మార్చి27: రావులపాలెంలోని అలివేలు మంగ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చనలు, అభిషేకాలు, అష్టోత్తర, సహస్ర నామ పూజలు జరిపి అన్ననివేదన చేశారు.

రెడ్డి సుబ్రహ్మణ్యంకు అభినందనలు

అంబాజీపేట, మార్చి 27: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యునిగా నియమితులైన రెడ్డి సుబ్రహ్మణ్యాన్ని టీడీపీ మండల నేతలు కలిసి అభినందనలు తెలిపారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి వీర వెంకటసత్యనారాయణ, సర్పంచ్ జల్లి బాలరాజు, ఎన్టీఆర్ యువసేన అధ్యక్షుడు వక్కలంక బుల్లియ్య, ఎంపీటీసీ పబ్బినీడి రాంబాబు, నాయకులు చిన్నం బాలవిజయరావు, యడ్లపల్లి తుక్కియ్య, కాసా నాగమల్లేశ్వరరావు, మోకా శ్రీను అభినందనలు తెలిపిన వారిలో వున్నారు.

జన సైనికులు పనిచేసేది పార్టీ కోసమే



మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ యాళ్ల నాగసతీష్

అమలాపురం రూరల్, మార్చి 27: అమలాపురం అసెంబ్లీ సీటును టీడీపీకి కేటాయించడంతో జనసేన కేడర్‌లో నైరాశ్యం నెలకొందని పలువురు నాయకులు పేర్కొన్నారు. దానికితోడు నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు వైసీపీ జిల్లా కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డిని కలవడంతో నియోజకవర్గ జనసేనలో మరింత నిరుత్సాహం వచ్చిందని మదనపడ్డారు. జనసేనలో ఎవరు ఎన్నివర్గాలుగా ఉన్నా అందరూ పనిచేసేది పార్టీ కోసమేనని స్పష్టం చేశారు. ఎ.వేమవరంలో బుధవారం జనసేననాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రానున్న కాలంలో జనసేనను ఎలా నడిపించుకోవాలి, మిత్ర పార్టీలైన టీడీపీ, బీజేపీ వద్ద జనసేన కార్యకర్తల భవిష్యత్తుకై అడగాల్సిన హామీలపై చర్చించారు. నియోజకవర్గ పరిస్థితులను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి అనంతరం ఉమ్మడి కార్యాచరణపై మరోసారి సమావేశం నిర్వహించి ముందుకు సాగాలని తీర్మానించారు. జనసేన నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని వక్తలు పిలుపునిచ్చారు. నాయకులు సలాది వెంకటరమణ, నల్లా శ్రీధర్, మున్సిపల్ మాజీ చైర్మన్ యాళ్ల నాగసతీష్, కంచిపల్లి అబ్బులు, యేడిద శ్రీను, ఇసుకపట్ల రఘుబాబు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, లింగోలు పండు మాట్లాడారు. ఆకుల సూర్యనారాయణమూర్తి, నల్లా అజయ్, మొయిల శివ, ఆర్డీఎస్ ప్రసాద్, బట్టు పండు, చాట్ల మంగతాయారు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జనసేనలో సీనియర్ నాయకులకు పిలుపు ఇవ్వకుండా కొందరు నాయకులతో సమావేశం నిర్వహించడాన్ని జనసేన పార్టీ రాష్ట్ర ప్రోగ్రామ్స్ కమిటీ కార్యదర్శి మహదశ నాగేశ్వరరావు ఖండించారు.

విద్యార్థులకు బైబిళ్ల పంపిణీ.. అడ్డుకున్న స్థానికులు

అమలాపురం రూరల్, మార్చి 27: కామనగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో బుధవారం విద్యార్థులకు బైబిళ్లను పంపిణీ చేస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. కొద్దిసేపు వారితో వాగ్వివాదం జరిగింది. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగియడంతో చర్చి పాస్టర్ మొగలి స్వర్ణన్‌రాజు ఆధ్వర్యంలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులకు బైబిళ్లను పంపిణీ చేయడం ప్రారంభించారు. స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు అడ్డుకుని పాస్టర్‌తో వాగ్వివాదానికి దిగారు. దాంతో విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ బైబిళ్లను తీసుకుని వెళ్లిపోవాలని సూచించడంతో అక్కడి నుంచి స్వర్ణన్‌రాజు, ఆయన అనుచరులు తిరిగి వెళ్లిపోయారు. కొన్నేళ్లుగా పదో తరగతి పరీక్షలు తరువాత విద్యార్థులకు బైబిళ్లు పంపిణీ చేస్తున్నానని, ఎవరు అడ్డుకోలేదని స్వర్ణన్‌రాజు తెలిపారు. బైబిళ్ల పంపిణీలో వలంటీర్లు మోకా వెంకన్నబాబు, ఉడుము ప్రసాదరావు సహకరించారు.

వైభవంగా వినాయకుడి కల్యాణం

అంబాజీపేట, మార్చి 27: మాచవరంలో వేంచేసియున్న శ్రీయువగణపతి ఆలయంలో స్వామివారి దివ్యకల్యాణాన్ని బుధవారం రాత్రి ఆలయ అర్చకులు కొడమంచిలి వెంకటకృష్ణ నాగేశ్వరరావుశర్మ పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఘనంగా రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు

అమలాపురం టౌన్, మార్చి 27: మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ జన్మదిన వేడుకలను బుధవారం మెగా అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అమలాపురం లూయా అంధుల పాఠశాలలో చిరంజీవి యువత ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పట్టణ యువత అధ్యక్షుడు నల్లా చిట్టిబాబు, చిరంజీవి యువత అఖిలభారత ఉపాధ్యక్షుడు యేడిద శ్రీను, నల్లా నాయుడు, ఉద్దిశపు చిన్నా, వాకాడ సుబ్రహ్మణ్యం, పోలిశెట్టి రాము, మెగా అభిమానులు పాల్గొన్నారు.

అంతర్వేది: గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం నామన నాగభూషణం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్ ప్రారంభించి, అనంతరం కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. ఎక్కువసార్లు రక్తదానంచేసిన దాతలకు సర్టిఫికెట్లు అందించారు. పేదలకు దుప్పట్లు, వస్త్రాలు, వృద్ధులకు అల్పాహారాలు అందించారు. నియోజకవర్గ సమన్వయకర్త గుండుబోగుల పెద్దకాపు, రాష్ట్ర కార్యదర్శులు గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, దిరిశాల బాలాజీ, తాడి మోహనకుమార్, కోకన్వీనర్ పినిశెట్టి బుజ్జి, జిల్లా కార్యదర్శి గుండాబత్తుల తాతాజీ, మండల అధ్యక్షుడు గుబ్బల పణికుమార్, ఉండపల్లి అంజి, యెనుముల వెంటపతిరాజా, జనసేన నాయకులు, మెగా అభిమానులు, ఉమ్మడి పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజోలు: రాజోలులో గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు చిరు, పవన్ సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. చిరు,పవన్ సేవాసమితి ఆధ్వర్యంలో పది మంది యువకులు రక్తదానం చేశారు. జనసేన పార్టీ రాజోలు మండల అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీను, వైస్ ఎంపీపీ యింటిపల్లి ఆనంద రాజు, కోళ్ల బాబి, ఉలిశెట్టి లక్ష్మణ్, వడ్లమూడి చిన్నీ పాల్గొన్నారు.

డీఎస్పీ విచారణ

ముమ్మిడివరం, మార్చి 27: ముమ్మిడివరం పోలీసుస్టేషన్‌లో జనసేన పార్టీ నాయకుడు గోదశి పుండరీష్‌కు, ఎస్ఐ డి.సురేష్‌బాబుకు మధ్య చోటుచేసుకున్న వివాదంపై అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు బుధవారం విచారణ నిర్వహించారు. ముమ్మిడివరం సర్కిల్ పోలీసుస్టేషన్‌లో సీఐ ఎన్.కొండయ్య, బాధితుడు గోదశి పుండరీష్, పెద్దలు గుద్దటి జమి, దూలిపూడి చక్రం, గొలకోటి దొరబాబు, గణేశుల బ్రహ్మానందం సమక్షంలో డీఎస్పీ విచారణ చేపట్టారు. గోదశి పుండరీష్ జరిగిన సంఘటనను, ఎస్ఐ ప్రవర్తించిన తీరును వివరించి దురుసుగా ప్రవర్తించిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. జరిగిన సంఘటనపై ఇప్పటికే విచారణ నిర్వహించామని, ఎస్ఐ దురుసుగా ప్రవర్తించినట్టు తేలిందని, సమగ్రమైన దర్యాప్తు నిర్వహించి చర్యలు తీసుకుంటానని, బాధితునికి న్యాయం చేస్తానని డీఎస్పీ హామీ ఇచ్చారు.

కేదార్లంకలో గడపగడపకు ...

కపిలేశ్వరపురం, మార్చి27: కేదార్లంకలో బుధవారం నిర్వహించిన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పాల్గొన్నారు. ఇంటింటా పర్యటించి ప్రజల సమస్యలనుఅడిగి తెలుసుకుని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేదార్లంక పంచాయతీ శివారు వీధివారిలంక ఎస్సీ ఏరియాలో ఉన్న ఓ భారీ గొయ్యిని పూడ్చి, దీనికి సంబంధించిన శిలాఫలకాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆవిష్కరించారని టీడీపీ యువత మండల అధ్యక్షుడు వీధిప్రసాద్ తెలిపారు. దీనిపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక శిబిరం

అంతర్వేది, మార్చి27: జిల్లాలో 2023-24 ఏడాదికి దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు అందించడానికి కోఆర్డినేటర్ మధుసూదనరావు ఆధ్వర్యంలో ఈనెల28 నుంచి ఏప్రిల్ 3వరకు ఎసెస్‌మెంట్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో డి.కిశోర్‌కుమార్ తెలిపారు. రాజోలు నియోజకవర్గంలోని 4మండలాలకు 28న రాజోలులో దొరగారితోట ప్రైమరీస్కూలు భవిత కేంద్రంలో శిబిరం నిర్వహిస్తామన్నారు. జె.మిస్సమ్మ, పి.సత్య, సంధ్య, రాజబాబు, కిశోర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి వైద్యలింగం నామినేషన్ దాఖలు



యానాం, మార్చి27:పుదుచ్చేరి లోక్‌సభకు కాంగ్రెస్ అభ్యర్థిగా పుదుచ్చేరి ప్రస్తుత లోక్‌సభ సభ్యుడు, మాజీ సీఎం వి.వైద్యలింగం నామినేషన్ దాఖలు చేశారు. తొలుత మాజీ సీఎం నారాయణస్వామితో కలిసి వివిధ ఆలయాల్లో పూజలు అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరారు. నారాయణస్వామి సమక్షంలో వైద్యలింగం నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి కులుతుంగన్‌కు అందజేశారు. ఇక్కడ ఎన్‌డీఏ అభ్యర్థి నామశ్శివాయ, కాంగ్రెస్ అభ్యర్థి వైద్యలింగం మధ్య పోటీ ఉంది.

గురుకుల విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మామిడికుదురు, మార్చి 27: ఏపీ గురుకుల విద్యాలయాల్లో మైనార్టీల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఏపీఆర్ మైనార్టీ బాలుర స్కూలు ప్రిన్సిపాల్ జె.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వచ్చే విద్యా సంవత్సరానికి కోస్తా ప్రాంతాల్లో ఉన్న తొమ్మిది జిల్లాల్లోని మైనార్టీలు మే 1వ తేదీ నుంచి ప్రవేశ పరీక్ష లేకుండానే నేరుగా అడ్మిషన్ పొందవచ్చని, ప్రవేశం పొందిన విద్యార్థులకు అనుభవం కలిగిన ఉపాధ్యాయుల ద్వారా ఆంగ్ల బోధన, బైజూస్ యాప్ బోధన, ఉచిత వసతి సదుపాయం, క్రీడలు, వ్యాయామానికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈనెల31వ తేదీలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు నేరుగా పాఠశాలను గాను, 9849693011, 9912638805 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఉపాధి హామీ మేట్లకు శిక్షణ

అంతర్వేది, మార్చి 27: సఖినేటిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ మేట్ శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మస్తరు నిర్వహణ, ఎన్ఎంఎంఎస్ ద్వారా హాజరు, కొలతలు, వంద రోజుల పనిదినాలపై పి.గన్నవరం క్లస్టర్ ఏపీడీ జీవీకే మల్లికార్జునరావు, సీబీ ఏపీడీ జి.కవిత, ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీవో ఎండీ నాగప్రసాద్, ప్లాంటేషన్ మేనేజర్ త్రినాథ్, జేఈ ఎన్.శ్రీను పాల్గొని శిక్షణ ఇచ్చారు.

శతాధిక వృద్ధురాలు సీతమ్మ మృతి



అల్లవరం, మార్చి27:దేవగుప్తంపంచాయతీ నల్లగుంటగ్రామానికి చెందిన దాకారపు సీతమ్మ(102)బుధవారం మృతిచెందారు. ఆమెకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సీతమ్మ మృతికి సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు సాధనాల వెంకట్రావు, సాధనాల శ్రీను, రాజు ప్రగాఢ సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వైసీపీ ప్రచారం

ఉప్పలగుప్తం, మార్చి 27: అమలాపురం అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ బుధవారం ఎస్.కొత్తపల్లి పంచాయతీ నల్లావారిపేటలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బద్రి బాబ్జీ ఆధ్వర్యంలో అమలాపురం లోక్‌సభ అభ్యర్థి రాపాక వరప్రసాద్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్, ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్, స్థానిక నాయకులు దండు సత్తిబాబురాజు, లంకే శ్రీను, నడింపల్లి వాసు, పొగాకు శ్రీను, బొడ్డు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలుచేయాలి

అంతర్వేది, మార్చి 27: సఖినేటిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రేడ్-1,2,5, వీఆర్వోలు, మహిళా పోలీసులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం సమీక్షా నిర్వహించారు. తాగునీటిపై సమస్యలు, తాగునీటి యాక్షన్ ప్లాన్, ఎంసీసీ కోడ్ అమలు చేయాలని ఆదేశాలు జారీచేశారు. తహసీల్దార్ పెద్దిరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ శిరీష పాల్గొన్నారు.

అధికారులతో ఎన్నికల పరిశీలకుడు సమీక్ష

యానాం, మార్చి 27: పుదుచ్చేరి లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఇద్దరు వ్యయ పరిశీలకులను నియమించింది. పుదుచ్చేరికి ఐఆర్ఎస్ అధికారి డి.లక్ష్మీకాంతన్‌ను, కారైకాల్, మహే, యానాం నియోజవర్గాలకు ఎం.డి.మజూరుల్ హసన్‌ను నియమించారు. మంగళవారం రాత్రి యానాం చేరుకున్న ఎం.డి.మజూరుల్‌హసన్ బుధవారం ఉదయం యానాం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. యానాంలో ఎన్నికలకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్ఏ మునిస్వామి, ఎస్పీ రాజశేఖర్, వివిధ శాఖలకు చెందిన ఎన్నికల అధికారులు పాల్గొన్నారు. కేంద్ర బలగాలు బుధవారం ఎస్పీ రాజశేఖర్, సీఐ షణ్ముగం నేతృత్వంలో యానాం పురవీధుల్లో కవాతు నిర్వహించారు.

శెట్టిబలిజ ఆత్మీయ సమావేశం

ఐ.పోలవరం, మార్చి27: మురమళ్ళ క్యాంపు కార్యాలయంలో బుధవారం శెట్టి బలిజ ఆత్మీయ సమావేశం జరిగింది. రాబోయే ఎన్నికల్లో ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని శెట్టిబలిజ పెద్దలు పిలుపుఇచ్చారు. బుచ్చిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో బీసీలకు న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. గుత్తుల సాయి, టేకుమూడి లక్ష్మణరావు, శీలం సత్యనారాయణ, గంజా సుధాకర్, కట్టా త్రిమూర్తులు, వాసంశెట్టి శ్రీను, పిల్లి నాగరాజు, వాసంశెట్టి అమ్మాజీ, బొక్కా రుక్మిణి, కుడుపూడి మల్లేశ్వరి, పిల్లి సత్తిబాబు, గంజా సూరిబాబు, విత్తనాల వెంకటరమణ, పలివెల త్రినాధరావు, రెడ్డి బాలకృష్ణ, రెడ్డి శ్రీను పాల్గొన్నారు.

రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలి

అల్లవరం, మార్చి 27: వ్యవసాయ, రెవెన్యూ సొసైటీల అధికారులు సమన్వయంతో ఉండి రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని, గోనెసంచులను సిద్ధంగా ఉంచాలని తహసీల్దారు పి.సునీల్‌కుమార్ కోరారు. అల్లవరంలోని వెలుగు కార్యాలయంవద్ద బుధవారం ఆయన ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలుపై గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు, సొసైటీల సీఈవోలతో మండల స్థాయిలో శిక్షణఇచ్చారు. మండలంలో 4,297ఎకరాల్లో వరిసాగు జరుగుతోందని, 16వేలటన్నుల దిగుబడి వస్తుందన్నారు. 75కిలోల సాధారణ రకం రూ.1,637 మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఆర్ఐ మేడిద దుర్గాశ్రీనివాస్, ఏఎస్‌వో సూర్యనారాయణ, సొసైటీల సీఈవోలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువకుడికి వైద్య సేవలు

ముమ్మిడివరం, మార్చి 27: మతి స్థిమితం లేని ఓ యువకుడికి ముమ్మిడివరం మండలం లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మహ్మద్ రహ్మతుల్లా మెరుగైన వైద్య అందించారు. ఐ.పోలవరం మండలం కేశనకుర్రు పంచాయతీ పెదలంకకు చెందిన జనిపల్లి గోపికి మతిస్థిమితం లేకపోవడంతో గ్రామం వారందరినీ, ఇంట్లో వారిని ఇబ్బందులకు గురిచేస్తుండేవాడు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మహ్మద్ రహ్మతుల్లా స్పందించి అతడిని ఐ.పోలవరం పోలీసుల ద్వారా ముమ్మిడివరం రప్పించి విశాఖపట్నం ప్రభుత్వ మెంటల్ హెల్త్‌కేర్ ఆసుపత్రికి పంపించారు. అక్కడ వైద్యం తరువాత గోపీ మానసికస్థితి మెరుగుపడడంతో జడ్జి రహ్మతుల్లా కుటుంబ సభ్యులకు అతడిని అప్పగించారు.

మద్యం స్వాధీనం

కాట్రేనికోన, మార్చి 27: మొల్లేటిమొగలో బెల్టుషాపు నిర్వహిస్తున్న ఓలేటి గంగాద్రిని అరెస్టుచేసి, 123ఎన్డీపీ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. నిందితుని కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

వెంకన్న ఆదాయం రూ.1.65లక్షలు

ఆత్రేయపురం, మార్చి27: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,65,748 లభించినట్టు ఈవోకిషోర్‌కుమార్ తెలిపారు.